క్లుప్తంగా

ప్రారంభమైన పత్తి కొనుగోళ్లు

సాక్షి ఎఫెక్ట్..

చెన్నూర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ పరిధిలోని వరలక్ష్మీ, చెన్నూర్ కాటన్, జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపడుతున్నట్లు మార్కెట్ కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. ప్రైవేట్‌లో పత్తి ధర పెరగడంతో రైతులు ప్రైవేట్‌కు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. సీసీఐ ద్వారా విక్రయించే రైతులకు ఆయా మిల్లుల్లో రసీదులను ఇస్తున్నామని తెలిపారు. రైతుల వద్ద పత్తి ఉన్నంత వరకు సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు జరుగుతాయని తెలిపారు.

'విశ్వబ్రాహ్మణులను చిన్నచూపు చూడొద్దు'

కోటపల్లి: చెన్నూర్ నియోజకవర్గంలోని నామినేటెడ్ పోస్టులను విశ్వబ్రాహ్మణులకే కేటాయించాలని కోటపల్లి మండల స్వర్ణకార సంఘం అధ్యక్షుడు భద్రయ్యచారి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర వహించారని శ్రీకాంతాచారి, ప్రొఫెసర్ జయశంకర్ వంటి మేధావులు తెలంగాణ కోసం అసువులు బాసిన ఘనత విశ్వబ్రాహ్మణులకే ఉందన్నారు. తెలంగాణ వచ్చాక విశ్వబ్రాహ్మణ కులానికి ఎలాంటి ప్రాధాన్యం లేకుండా పోయిందని తెలిపారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆలోచించి విశ్వబ్రాహ్మణులను చిన్నచూపు చూడకుండా నియోజకవర్గంలో అవకాశమున్న నామినేట్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.

క్రికెట్ పోటీల విజేత కన్నాల బస్తీ జట్టు



విజేతలకు ట్రోఫీ, ప్రైజ్‌మనీ ఇస్తున్న స్వామి

బెల్లంపల్లి: సింగరేణి తిలక్ స్టేడియంలో త్రిశూల్ సేన ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ పోటీలు సోమవారం ముగిసాయి. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో మొత్తం ఆరు బస్తీల నుంచి క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. వీరిలో కన్నాల బస్తీ, పోస్టాఫీసు బస్తీల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. రెండు జట్ల మధ్య హోరాహోరీగా పోటీ జరగ్గా కన్నాల బస్తీ జట్టు విన్నర్స్‌గా, పోస్టాఫీసు బస్తీ రన్నర్స్‌గా నిలిచాయి. విజేతలైన క్రీడాకారులకు టీపీసీసీ ప్రచా ర కమిటీ సభ్యుడు నాతరి స్వామి, కాంగ్రెస్ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై ట్రోఫీ, ప్రైజ్‌మనీ అందజేశారు.

కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాంబాబు

మందమర్రిరూరల్: నేతకానీ కులస్తులకు కుల ధృవీకరణ పత్రం జారీ చేసే సమయంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి నెట్‌కాని అని కుల ధృవీకరణ పత్రంలో వస్తుందని, దీంతో పై చదువులకు విద్యార్థులకు ఇబ్బంది అవుతుందని అలా కాకుండా నేతకాని అని ధృవ పత్రం వచ్చే విధంగా సరిచేయాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం జిల్లా ఇన్‌చార్జి సునార్కర్ రాంబాబు సోమవారం కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందించారు. ఆ సంఘం నాయకులు కొండగోర్ల శ్రీనివాస్, కామెర దుర్గరాజ్ ఉన్నారు.

విగ్రహ ప్రతిష్టాపన



పూజలు చేస్తున్న భక్తులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం చంద్రవెల్లిలో సోమవారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని నర్సింగాపూర్‌లో శ్రీ ఆంజనేయ స్వామి నూతన ఆలయంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు మూడు రోజులుగా సాగుతున్నాయి. ఫల, పుష్ప, షయ్యాదివాసాలతో పాటు హనుమాన్ హోమ కార్యక్రమాలను ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, ప్రజలు పాల్గొన్నారు.



అపరిశుభ్రం.. గోదావరి తీరం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని ముల్కల్ల గోదావరి నదితో పాటు గోదావరి తీర, పుష్కర ఘాట్ పరిసరాల ప్రక్షాళన ఎప్పుడని ప్రశ్నిస్తున్నారు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వస్తున్న భక్తులు. మహాశివరాత్రి పర్వదినోత్సవం మార్చి 8వ తేదీన ఉండటంతో ఇప్పటికే గోదావరి పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు వస్తున్నారు. ప్రస్తుతం ముల్కల్ల గోదావరి తీరంతో పాటు పుష్కర ఘాట్ ప్రాంతమంతా కూడా పూర్తి అపరిశుభ్రంగా మారింది. ఇదే కొనసాగితే ఈ మహాశివరాత్రి పుణ్యస్నానాలు ఆచరించడం కష్టమే అంటున్నారు. గోదావరి తీర ప్రాంతాల్లో ఎటు చూసినా చెత్తాచెదారంతో పాటు భక్తులు వదిలివెళ్లిన దేవుడి చిత్రపటాలు, పూజా సామగ్రి, ప్లాస్టిక్ కవర్లు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. ప్రతీ ఏడాది మహాశివరాత్రిని పండగ సమీపిస్తున్న తరుణంలో పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేది. సర్పంచ్, పాలకవర్గ సభ్యులు అధికారులతో కలిసి వారంరోజుల పాటు శ్రమించి గోదావరి తీర పరిసరాలతో పాటు పుష్కరఘాట్ ప్రాంతాన్ని శుభ్రం చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యక్రమాలు చేపట్టేవారు. ఇప్పుడు పాలకవర్గ సభ్యులు లేకపోవడంతో గోదావరి తీరప్రాంత పరిశుభ్రత ప్రశ్నార్థకంగా మారింది. ప్రత్యేకాధికారులు ఉన్నా వారంతా వారి సొంత శాఖల్లో బిజీగా ఉండగా, మరోవైపు పంచాయతీల్లో ఎలాంటి చెక్‌పవర్ లేకపోవడంతో ఖర్చు పెట్టాలంటే కూడా వెనకడుగు వేసే పరిస్థితులు ఎదురవుతున్నాయి.ఇప్పటికైన గోదావరి తీర ప్రాంతాలను, పరిసరాలను పరిశుభ్ర పర్చాలని, బట్టలు మార్చుకునే తాత్కాలిక షెడ్డును సైతం మరమ్మతు చేయించి మహిళలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.



ముల్కల్ల గోదావరి తీరప్రాంతం



పుష్కరఘాట్‌కు వచ్చే దారికి ఇరువైపులా..





అపరిశుభ్రంగా ఉన్న గోదావరి తీరం



బట్టలు మార్చుకునే తాత్కాలిక షెడ్డు పరిస్థితి

స్పెషలిస్టు వైద్యులను నియమించాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో స్పెషలిస్టు వైద్యులను , తగినంత మంది సిబ్బందిని నియమించి కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ఏరియా నాయకులు డిమాండ్ చేశారు. ఏరియా ఆసుపత్రి ఇన్‌చార్జి డీవైసీఎంఓ రాజేశ్వర్‌రావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏరియా ఆసుపత్రిపై 4వేల పైచిలుకు కార్మిక కుటుంబాలు చికిత్స కోసం ఆధారపడి ఉన్నాయని తెలిపారు. వీరికి వైద్యసేవలు అందించడానికి ఆసుపత్రిలో సరైన పరికరాలు లేవన్నారు. వీటిని వెంటనే తెప్పించి, నిపుణులైన వైద్యుల నియామకాలు చేపట్టాలని అన్నారు. ఆసుపత్రిలో ఉన్న అన్ని రకాల వార్డులను పునఃప్రారంభించాలని, అదే తీరుగా అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచి ఏరియా ఆసుపత్రికి సింగరేణి యాజమాన్యం పూర్వ వైభవం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సింగరేణి విభాగం కేంద్ర కమిటీ నాయకులు ఎస్.రాజమొగిలి, బెల్లంపల్లి ఏరియా నాయకులు పేరం శ్రీనివాస్, డి.ఉమాదేవి, సోకాల శ్రీనివాస్, మాసాడి నారాయణ, పి.చంద్రకుమార్, అనంతకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యుడికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

జన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్‌కు పోటీ

జన్నారం: మండల మార్కెట్ కమిటీ రద్దవడం, ఈ సంవత్సరం మార్కెట్ కమిటీని ఎస్సీ జనరల్‌కు కేటాయించడంతో తీవ్ర పోటీ నెలకొంది. ఇప్పటివరకు 16మంది పదవిని ఆశిస్తుండగా, చివరికి ఆరుగురి మధ్య తీవ్ర పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. జన్నారం మండలం ధర్మారం మాజీ సర్పంచ్ దుర్గం లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ, పార్టీ ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, రేండ్లగూడకు చెందిన దాముక కరుణాకర్, కిష్టాపూర్‌కు చెందిన కండ్లె చంద్రయ్య, పొనకల్‌కు చెందిన టేకుమట్ల పంకజ, దుమల్ల రమేశ్‌లు పదవిని ఆశిస్తున్నారు. ఎవరికి తోచిన దారిలో వారే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే దృష్టిలో పడేందుకు తమ నివేదికలను అందజేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, సీనియర్ నాయకులు రాజశేఖర్, ఇసాక్‌లు మార్కెట్ పదవి ఆశిస్తున్న ఆరుగురిని పట్టుకుని ఎమ్మెల్యే వద్దకు వెళ్లినట్లు తెలిసింది. ఆరుగురు పదవి ఆశిస్తున్నందునా, వీరిలో ఒక్కరికి ఇచ్చి, మిగితా వారికి ఇతర పదవులు ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు సమాచారం.

డీఆర్‌డీవోను కలిసిన ఎంపీపీ

కోటపల్లి: మంచిర్యాల గ్రామీణ అభివృద్ధి అధికారిగా నూతన బాధ్యతలు చేపట్టిన కిషన్‌ను సోమవారం ఎంపీపీ మంత్రి సురేఖా మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి కోటపల్లి మండల సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. ఆలుగామ, ఎడగట్ల గ్రామపంచాయతీ పరిధిలో సీఎం గిరివికాస్ పథకంలో వ్యవసాయబోర్లు మంజూరు కాగా ఫారెస్టు అధికారులతో మాట్లాడి బోర్లు వేయించేలా చూడాలని విజ్ఞప్తి చేయగా పీడీ కిషన్ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీపీ సురేఖా తెలిపారు.



శాలువాతో సత్కరిస్తున్న ఎంపీపీ

నిధుల దుర్వినియోగంపై విచారించండి

- ప్రజావాణిలో ఫిర్యాదు

తాండూర్: స్థానిక గ్రామ పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగం పై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని తాండూర్ గ్రామానికి చెందిన కేశెట్టి తిరుపతి కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి చేసిన నిధుల దుర్వినియోగంపై గతంలో జిల్లా అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనికి ఆయన విచారణకు ఆదేశించినప్పటికీ అధికారులు పూర్తి స్థాయి విచారణ జరపకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం పై అధికారులను అడిగినప్పటికీ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని, ఇప్పటికైనా పూర్తిస్థాయి విచారణ జరిపి నిధుల దుర్వినియోగం నిగ్గు తేల్చాలని కోరారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న తిరుపతి

క్రషర్‌ను తొలగించాలని ఫిర్యాదు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామ శివారులోని సబ్‌స్టేషన్ పక్కన ఏర్పాటు చేసిన క్రషర్‌ను అక్కడి నుంచి తొలగించాలని కాంగ్రెస్ నాయకులు సుశీల్‌కుమార్, చింతల శ్రీనివాస్ మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రషర్ నుంచి దుమ్ము, ధూళి వస్తుందని దీంతో అక్కడ నివసించే వారు రోగాల బారిన పడుతున్నారన్నారు. ఇసుక క్రషర్ పంచాయతీ కార్యదర్శి అండదండలతో నడపడం జరుగుతుందన్నారు. వెంటనే అధికారిపై చర్యలు తీసుకొని క్రషర్‌ను తొలగించాలని కోరారు.

వారసత్వ భూమిని కాపాడాలని ఫిర్యాదు..

చెన్నూర్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వారసత్వ భూమిని కాపాడాలని కోరుతూ మండలంలోని లంబడిపల్లి గ్రామస్తులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు.

భయం వీడండి.. ఇష్టంతో చదవండి

- ఆత్మవిశ్వాసంతో చదివి మంచి మార్కులు సాధించండి
- డీఈవో యాదయ్య

కాసిపేట: పదో తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదివి మంచి మార్కులు సాధించాలని జిల్లా విద్యాధికారి యాదయ్య సూచించారు. మండల కేంద్రంలోని ముత్యంపల్లి రైతువేదికలో సోమవారం మండలంలోని పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సు, ప్రేరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ల ఆదేశానుసారం వందశాతం ఉత్తీర్ణత, అత్యధిక జీపీఏ సాధన ధ్యేయంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు భయం లేకుండా ఇష్టంతో చదివి మంచిమార్కులు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైకలాజిస్టు, వివిధ మండలాలకు చెందిన సబ్జెక్టు నిపుణలతో టైం మేనేజ్‌మెంట్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, పరీక్షపత్రంపై పూర్తి అవగాహన కల్పించారు. ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సెక్టోరోల్ అధికారి చౌదరి, డీసీఈబీ అధికారి భీంరావు, మండల నోడల్ అధికారి రమేష్ రాథోడ్, మోటివేటర్ మహిపాల్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య, హెచ్‌ఎంలు సాంబమూర్తి, సుధాకర్ నాయక్, ఎంపీవో నాగరాజు, సబ్జెక్టు నిపుణులు కర్ర రమేష్, మధుసూదన్ శర్మ, సేఫ్రియుద్దీన్, సతీష్, రాజేశం, మధుకర్, చంద్రవాస్, శాంకరీ, అరుణ, రమణారెడ్డి, సీసీవో రాంబాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

'పది' విద్యార్థులకు అవగాహన

మందమర్రిరూరల్: పట్టణంలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలోని మీటింగ్ హాల్లో సోమవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు అధికారులు వార్షిక పరీక్షపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు హాజరై అవగాహన కల్పించారు. పరీక్ష సమయంలో విద్యార్థులకు ఎలాంటి భయం లేకుండా ప్రశ్నపత్రాన్ని పూర్తిగా చదివి సమాధానాలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో భీరయ్య, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సుమారు 240మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కృషి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. బెల్లంపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. అభివృద్ధిలో బెల్లంపల్లి అత్యంత వెనుకబాటులో ఉందన్నారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి ప్రణాళిక బద్ధంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. బెల్లంపల్లిలో గోదావరి జలాల సరఫరా, మురుగునీటి కాలువల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపట్టడానికి కార్యాచరణ తయారు చేస్తున్నారు. అతిత్వరలో గోదావరి జలాల సరఫరా కోసం ప్రభుత్వం నుంచి తగినన్ని నిధులు మంజూరు చేయించుకు వస్తానని ప్రకటించారు. ప్రస్తుతంగా నియోజకవర్గ వ్యాప్తంగా సీసీ రోడ్లు, మురికి నీటి కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి భూమిపూజ చేస్తున్నట్లు వివరించారు. అభివృద్ధి, సంక్షేమం ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నామని ఇందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ కేవై ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత, పలువురు కౌన్సిలర్లు, అసెంబ్లీ నియోజవకర్గం పరిధిలోని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.



మహిళకు చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే. పక్కన ఆర్డీవో

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రూ.5లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మించే నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేసి ప్రారంభించారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మహేందర్, నాయకులు రామ్‌చందర్, స్వామి, మల్లయ్య, ప్రదీప్, భరత్, ఈసా తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: మండల కేంద్రంలోని ముత్యంపల్లిలో సోమవారం ఎమ్మెల్యే వినోద్ ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, వైస్ ఎంపీపీ విక్రంరావు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ పంపిణీ చేశారు. భీమినికి 9, కన్నెపల్లికి 24 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. జన్కాపూర్‌లో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. వెంకటాపూర్‌లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి ప్రభుత్వం నుంచి అన్నిరకాల సహాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సృజనరావు, భీమిని జెడ్పీటీసీ పోతురాజుల గంగక్క, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మదావరపు నర్సింగరావు, భీమిని, కన్నెపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మినారాయణ, రామాంజనేయులు, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఆర్ఐ కిషన్‌రావు, నాయకులు దుగుట చంద్రయ్య, జలపతి, బట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ అఫ్జలుద్దిన్

బెల్లంపల్లి: సైబర్ నేరాలపై ప్రజలు సరైన అవగాహన పెంచుకోవాలని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దిన్ తెలిపారు. బెల్లంపల్లి సుభాష్‌నగర్ బస్తీలో సోమవారం సైబర్ క్రైమ్‌పై స్థానికులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో సైబర్‌క్రైమ్ రేట్ పెరుగుతోందన్నారు. సరైన అవగాహన లేక అమాయక ప్రజలు సైబర్ నేరస్తుల వలలో చిక్కి మోసపోతున్నారని పేర్కొన్నారు. అలాంటి నేరాలకు గురికాకుండా సరైన అవగాహన పెంచుకుని జాగ్రత్తగా మసులుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్సై రమేష్, స్థానికులు పాల్గొన్నారు.

అతిరుద్ర మహాయాగం ప్రారంభం



యాగంలో పాల్గొన్న భక్తులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మహానంద సినిమా థియేటర్ సమీపంలో నిర్వహిస్తున్న 'అతిరుద్ర మహాయగం' సోమవారం పూజారులు ఘనంగా ప్రారంభించారు. భక్తులు పెద్దమొత్తంగా హాజరై వేదపండితులు, 200మంది ఋత్వికులు హాజరై దేవతామూర్తుల విగ్రహాలకు ప్రాణప్రతిష్ట చేశారు. మధ్యాహ్నం అభిషేకం నిర్వహించి అన్నప్రసాదాలు అందించారు. పీఠాధిపతులు జగద్గురు శంకరాచార్యులు, గురు మదనానందలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పారాయణం , మంగళహారతులతో కీర్తనలు పాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, డీసీసీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథరావు, 14వార్డు కౌన్సిలర్ చింత సువర్ణ, మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, నిర్వాహకులు చెట్ల రమేష్, పూజారులు భరద్వాజ శర్మ పలువురు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్థిక సాయం

రామకృష్ణాపూర్: పట్టణంలోని మల్లిఖార్జున్ నగర్‌కు చెందిన గుడిసె కొమురయ్య ఇల్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోగా అతడి కుటుంబానికి సోమవారం ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు భూమేష్, అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, అశోక్, కుమార్, సురేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత

నస్పూర్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నాంపల్లి వేణు కుటుంబ సభ్యులకు చిన్ననాటి మిత్రులు, స్థానికులు ఆర్థిక సాయం అందజేశారు. పట్టణ పరిధిలోని సంఘం మల్లయ్యపల్లెకు చెందిన వేణు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కాలనీ వాసులు రూ.39వేల నగదును పోగు చేసి మృతుడి కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో గుమ్మడి తిరుపతి, కళ్యాణం రవి, సతీష్ పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ ట్రయల్ రన్

బెల్లంపల్లిరూరల్: మండలంలోని కన్నాల రైతువేదికలో సోమవారం వీడియో కాన్ఫరెన్స్(వీసీ) ట్రయల్ రన్ జరిగింది. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన ప్రొజెక్టర్ స్క్రీన్, ఇతర పరికరాలను అమర్చి వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రారంభించారు.

కరపత్రాలు ఆవిష్కరణ

పాతమంచిర్యాల: మార్చి 3, 4, 5తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే విప్లవ పార్టీల ఐక్యతా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి గడ్డం సదానందం అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం మహాసభల కరపత్రాలను నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

వీధి దీపాలు ప్రారంభం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్-గుడిపేట పునరావాస కాలనీలో రూ.2లక్షల ఎంపీటీసీ నిధులతో ఏర్పాటు చేసిన వీధి దీపాలను ఎంపీటీసీ ఒడ్డె బాలరాజ్ చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు.

28న వైస్ ఎంపీపీ ఎన్నికలు

భీమారం: మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవికి ఈ నెల 28న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాధ తెలిపారు. ఈ మేరకు ఉదయం 11గంటలకు మండల ప్రత్యేక సమావేశంలో ఎన్నిక జరగుతుందని ఎంపీడీవో తెలిపారు. రెండేళ్ల నుంచి వైస్ ఎంపీపీ పోస్టు ఖాళీగా ఉంది. అయితే రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు ఎన్నికలు నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేయడంతో ఎన్నిక జరుగనుంది.